క్లుప్తంగా

ఆలయానికి వెండి పంచపాత్రల అందజేత



చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం వెండి పంచపాత్రలు అందజేశారు. ఉదయం ఆలయానికి చేరుక్ను కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయ రిటైర్డ్ ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి–స్వరూపరాణి, కుటుంబ సభ్యులు ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ లక్ష్మీ ప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు గణగోని రమేష్, గోలి రాజశేఖర్ ఆధ్వర్యంలో రూ. 92,338 వేల విలువైన 770 గ్రాముల వెండి పంచపాత్రలను అందజేశారు.

ఆంజనేయుడికి వెండి తమలపాకుల దండలు



జనగామ: వాసవీ క్లబ్ గెలాక్సీ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌నగర్ విజయపాలకేంద్రం సమీపంలోని హనుమాన్ దేవాలయ ఆంజనేయుడికి 10 తులాల వెండి తమలపాకుల దండను శనివారం పాలక మండలి కమిటీకి బహూకరించారు. క్లబ్ జనగామ అధ్యక్షుడు తాడూరి సంతోష్ రాజు, చార్టెడ్ ప్రెసిడెంట్ గందె వేణు, జోన్ చైర్మన్ బుస్సా సిద్దేశ్వర్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ సంతోష్, క్లబ్‌లో రీజియన్ చైర్మన్ రాజేష్, గవర్నర్ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



చిల్పూరు: ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



విజయ్



చరణ్

చిల్పూరు: చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7, 8 తరగతులు చదువుతున్న యశ్వంత్, నానిపాల్‌లు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గుడిమల్ల సంపత్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ రవిప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 60 మీటర్ల లాంగ్ జంప్ విభాగంలో, 600 మీటర్ల పరుగు పందెంలో యశ్వంత్, 60 మీటర్ల లాంగ్ జంప్, జావెలిన్ త్రోలో నానిపాల్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 3, 4 తేదీల్లో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు టి.చరణ్, టి.విజయ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు చరణ్, విజయ్ జూలై 28వ తేదీన జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కాగా, విద్యార్థులను పీఈటీలు బి.రాజు, ఎ.శ్రీనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

బచ్చన్నపేట: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నక్కవానిగూడెంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన బైకని బీరయ్య కుటుంబ సమేతంగా ఆరేండ్ల క్రితం నక్కవానిగూడేనికి వచ్చి కూలీనాలి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బీరయ్యకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెండు రోజుల క్రితం పొలం వద్ద తండ్రి పురుగుల మందు కొడుతుండగా అక్కడికి తల్లితో వెళ్లిన ఉమ గడ్డిమందు తాగింది. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. నాలుగు నెలల నుంచి ఉమ ఆరోగ్యం బాగో లేక మనస్థాపంతో పురుగుల మందు తాగినట్లు పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎస్కే అబ్దుల్ హమీద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపాలు శిశువుకు శ్రేష్టం

- అంగన్‌వాడీల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

సాక్షి నెట్‌వర్క్: తల్లిపాలు శిశువుకు ఎంతో శ్రేష్టమైనవని ఐసీడీఎస్ అధికారులు, మెడికల్ ఆఫీసర్లు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి గర్భిణులు, తల్లులు, పిల్లలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. శిశువు పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, పిల్లలకు ఆరునెలల వయస్సు నిండేవరకు తల్లిపాలనే తాగించాలని సూచించారు. కాగా, జనగామ మండలంలోని పసరమడ్ల, ఓబుల్‌కేశవాపూర్ గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ, ప్రీ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడారు.



జనగామ: తల్లిపాల వారోత్సవంలో అధికారులు



జనగామ రూరల్: వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావు



స్టేషన్‌ఘన్‌పూర్: అవగాహన కల్పిస్తున్న రేఖ



నర్మెట: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్



బచ్చన్నపేట: మాట్లాడుతున్న ఏఎన్‌ఎం శిరీష



జఫర్‌గఢ్‌లో..



పాలకుర్తి: ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఇప్పగూడెం, అక్కపెల్లిగూడెం, చంద్రుతండా గ్రామాల్లో శనివారం సోషల్ ఆడిట్ గ్రామసభలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025వరకు చేపట్టిన ఉపాధి పనులపై ఫీల్డ్ అసిస్టెంట్, మేట్, పంచాయతీ కార్యదర్శులు, కూలీల సమక్షంలో జిల్లా రీసోర్స్ పర్సన్‌లు ఆడిట్ చేపట్టారు. ఏఏ పనులు చేపట్టారు, ఎంత ఖర్చు చేశారు, పనుల్లో ఏమైనా అవకతవకలు జరిగాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఆర్‌పీలు కల్యాణి, కరుణాకర్ మాట్లాడారు. ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని, అవకతవకలకు పాల్పడితే శాఖాపరంగా చర్యలు తప్పవన్నారు. ఈసీ ఎస్.కిరణ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఎం ప్రేమయ్య, పంచాయతీ కార్యదర్శులు నరేష్, శారద, ఎఫ్‌ఏ మందపురం కవిత ఎల్లగౌడ్, జూనియర్ అసిస్టెంట్ మంజుల, కారోబార్ శ్రీను పాల్గొన్నారు.



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న ఎస్‌ఆర్‌పీ కల్యాణి

పాల్కురికి సోమనాథుడి స్మృతివనం పరిశీలన

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని తొలి తెలుగు విప్లవ కవి, బసవ పురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడి స్మృతి వనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారడంతో శనివారం డీఆర్‌డీఏ ఏపీడీ నూరొద్దీన్, ఆర్‌అండ్‌బీ డీఈ సతీష సందర్శించి పరిశీలించారు. గ్రంథాలయం, గదులన్ని మద్యం ఖాళీ సీసాలతో దర్శనమివ్వడంతో అధికారులు అవాక్కయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాలతో స్మృతి వనం సందర్శించినట్లు తెలిపారు. సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి సమీపంలో గత ప్రభుత్వం రూ. 5 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన సోమనాథుడి స్మృతి వనం మందు బాబులకు అడ్డగా మారడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు. అనంతరం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సోమనాథుడి స్మృతి వనాన్ని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు.



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిల్పూరు ఆలయంలో వార కల్యాణం

చిల్పూరు: చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాస రెండో శనివారం వారకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ మొదట శ్రావణ దీపం వెలిగించిన అనంతరం స్వామివారి వారకల్యాణం నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో శివునిపల్లి, వెంకటాద్రిపేట గ్రామాలకు చెందిన కరుణాకర్, ఎల్లయ్య, రాజమౌళిలు అన్న ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బత్తుల విజయ్‌కుమార్, ఎస్సై పిట్ల రాజేష్, సంగోజు మోహన్–శంకరలక్ష్మి, శ్రీచందన్, ప్రణశ్రీ, శ్రీనయ, ధర్మకర్తలు పాల్గొన్నారు.



వారకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జయప్రదం చేయాలి

జనగామ రూరల్: ఈ నెల 5, 6, 7 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో జరిగే అఖిల భారత మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో సంఘం కార్యాలయంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పంపర మల్లేశం అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్

జనగామ రూరల్: కమ్యూనిస్టులు ఉంటేనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని, దేశంలో ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. శనివారం పట్టణంలోని పూసల భవనంలో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, ఇర్రి అహల్య, సింగారపు రమేశ్, రాపర్తి సోమయ్య, మహేందర్, రాపర్తి రాజు, బొట్ల శేఖర్, భూక్య చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి



చైతన్య యాత్రలో వెంకటరమణ తదితరులు

జనగామ రూరల్: అమరుల స్ఫూర్తితో గీత కార్మికుల హక్కులకై ఉద్యమించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని వడ్లకొండ గ్రామంలో జిల్లా కార్యదర్శి బాల్నే వెంకటమల్లయ్య ఆధ్వర్యంలో అమరుల యాదిలో గీతన్నల సామాజిక చైతన్య యాత్రను ప్రారంభించారు. రాష్ట్ర గౌరవ సలహాదారు భీమగోని చంద్రయ్య జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ సొసైటీ అధ్యక్షుడు నామాల ఎల్లేష్, జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, రాజయ్య, భాస్కర్, వెంకటేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ చెరువుకు గోదావరి జలాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి: మండలంలోని ప్రతి చెరువు గోదావరి జలాలతో నింపడం కాంగ్రెస్ పార్టీ బాధ్యత అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు శనివారం బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి మంగళిబండతండా, ఖిలాషాపూర్ పటేల్ చెరువులను నింపేందుకు ఆయన పార్టీ నాయకులు, రైతులతో కలిసి కాలువలను పరిశీలించారు. కాల్వల్లో పేరుకుపోయిన మట్టి, తుంగ చెట్లను జేసీబీతో తొలగింప జేశారు. అదే విధంగా మేకలగట్టు చెరువుకు నీరు వెళ్లే విధంగా కాల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగా జగదీష్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతిగా పనిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి 1ఎల్, 2ఎల్ కాల్వలను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ జిల్లా నాయకులు దుంపల పద్మారెడ్డి, మంతెన ఇంద్రారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మాచర్ల కుమారస్వామి, గాదె చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న రాంబాబు, జగదీష్‌చందర్‌రెడ్డి

దేవాదుల కాల్వ ద్వారా నీటి విడుదల

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లి గ్రామంలో దేవాదుల కాల్వ ద్వారా చెరువు, కుంటలకు నీటిని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బొమ్మినేని శ్రీదేవి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎడ్ల వెంకటస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు దేవాదులకు నీటిని కాల్వ ద్వారా చెరువు, కుంటలకు విడుదల చేసినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు మర్రి సుధీర్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు బొమ్మినేని రాజిరెడ్డి, యాదవ సంఘం అధ్యక్షులు చల్ల సమ్మయ్య, కనకయ్య, రైతులు పాల్గొన్నారు.

హజ్ యాత్ర-2026కు దరఖాస్తుల గడువు పొడిగింపు

జనగామ: జిల్లా నుంచి హజ్ యాత్ర–2026కు వెళ్లే యాత్రీకులు ఈ నెల7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ హఫీజ్ కాస్మీ, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖ్వాజా ముజ్తహిదొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర హజ్ కమిటీ జారీ చేసిన ప్రకటన నేపథ్యంలో ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీని పొడిగించడం జరిగిందన్నారు. జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. యాత్రకు వెళ్లాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేటికి దరఖాస్తు చేసుకోలేని వారు హజ్ సొసైటీ బాధ్యులతో పాటు జామియా మస్జిద్ సమీపంలోని నూర్ క్లాత్స్ స్టోర్ లోని హజ్ సొసైటీ ప్రతినిధులు జహీరొద్దీన్ సంప్రదించాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిని లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 20వ తేదీకి ముందు హజ్ అడ్వాన్స్ ఫీజును చెల్లించాల్సి ఉంటుందన్నారు. వారి వెంట హజ్ సొసైటీ జిల్లా బాధ్యులు మహమ్మద్ సమ్మద్, మసిఎర్ రెహమాన్, జలీల్, హఫీజ్, హనీఫ్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జనగామ రూరల్: మత్తు పదార్థాలకు ప్రతీఒక్కరు దూరంగా ఉండాలని ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బాలకృష్ణ అన్నారు. శనివారం మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా మహిళా అభివృద్ధి సంస్థ పునరావాస కేంద్రం అధ్వర్యంలో గానుగుపహాడ్ గ్రామంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్యురాలు లిఖిత మాట్లాడుతూ ప్రతీఒక్కరు మత్తు పదార్థాలకు అలవాటుపడి అమూల్యమైన జీవితాన్ని వృథా చేసుకోవద్దన్నారు. అనంతరం గ్రామస్తులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎండీ షాను, బండ రాజు, కె శ్రీనివాస్, బి తిరుపతి పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు



కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని వేల్పుగొండ కొండపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామిని శనివారం వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఏటా శ్రావణ మాసంలో నెల రోజుల పాటు లక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయాన్నే వివిధ ప్రాంతాల నుంచి పలు వాహనాల్లో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో కోనేరులో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కొండ దిగువన ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడా భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. కాగా, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గన్ను నర్సింహులు, అన్నదాన కమిటీ అధ్యక్షుడు చిట్టిమళ్ల కృష్ణమూర్తి, పాలకుర్తి రాజయ్య, శ్రవణ్‌కుమార్, దొడ్డ రమేష్, పూర్ణచందర్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు యుగంధర్, కార్యదర్శి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోబోటిక్ ప్రాజెక్టు తయారీలో శిక్షణ

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం రోబోటిక్ ప్రాజెక్టు తయారీపై 8వ తరగతి విద్యార్థులకు సోహం అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. నిత్య జీవితంలో రోబోటిక్స్ ప్రాధాన్యత, భవిష్యత్‌లో వాటి ఉపయోగాలను వివరిస్తూ సోహం అకాడమీ శిక్షకులు సచిన్, మనీష్‌లు విద్యార్థులకు వివరించారు. వాటి తయారీపై శిక్షణ ఇచ్చి ఇద్దరు విద్యార్థులను టీం లీడర్లుగా నియమించారు.

హద్దు రాళ్ల తొలగింపు

తరిగొప్పుల: మండల కేంద్రంలోని అక్రమ లే ఔవుట్లలో ఉన్న హద్దు రాళ్లను గ్రామ పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్, పెద్దమ్మ గుడి సమీపంలో వెలసిన అక్రమ లే ఔవుట్లలోని హద్దు రాళ్లను తొలగించారు. గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలను చేపడితే కూల్చివేస్తామన్నారు.

ఫుడ్ వెండర్స్ శిక్షణను వినియోగించుకోవాలి

జనగామ రూరల్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా, మున్సిపాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణ వీధి విక్రయదారుల పురోభివృద్ధి చట్టంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ భారత్ నిధి–వీధి విక్రయదారుల పురోభివృద్ధి చట్టం నియమ నిబంధనల ప్రకారం పట్టణంలోని వీధి విక్రయదారులను మెప్మా సిబ్బంది ద్వారా సర్వే చేసి వారిని గుర్తించి ప్రత్యేక గుర్తింపు కార్డుతో పాటు పీఎం స్వనిధి పథకంలో భాగంగా బ్యాంకుల ద్వారా రుణాలు అందించినట్లు తెలిపారు. కావున ఫుడ్ వెండర్స్ తమ పాస్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరానికి రావాలన్నారు.

కాసర్ల శ్యామ్‌కు అభినందన

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: ఊరి పరిమళాన్ని యావత్ ప్రపంచానికి ఒక్క పాటతో వ్యాపింపచేసి ఉత్తమ గేయా రచయిత అవార్డు వరించడం గొప్ప విషయం అని శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫోన్‌లో కాసర్ల శ్యామ్‌కు అభినందనలు తెలిపారు. 71వ నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్‌లో ఊరు పల్లెటూరు పాటకు మన వరంగల్ బిడ్డ కాసర్ల శ్యామ్‌కు ఉత్తమ గేయ రచయిత అవార్డు రావడం చాల సంతోషంగా ఉందన్నారు.

మండల వ్యవసాయాధికారి బదిలీ

లింగాలఘణపురం: మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. రఘునాథపల్లి మండల ఏఓ శ్రీనివాసురెడ్డిని లింగాలఘణపురం మండల ఇన్‌చార్జ్ ఏఓగా నియమించారు. కొత్తగా ఇంకా పూర్తి స్థాయి ఏఓను నియమించలేదు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయాలి

జనగామ రూరల్: గానుగుపహడ్, చిటకోడూర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని బ్రిడ్జిసాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్, ఇరుగు సిద్దులు డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణ సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి.

విజయవంతం చేయండి

పాలకుర్తి టౌన్: పద్మశ్రీ మంద కృష్ణ పిలుపు మేరకు ఈనెల 13వ తేదీన హైదారాబాద్‌లో జరిగే దివ్యాంగుల మహా గర్జనను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమరాజ్, ప్రధాన కార్యదర్శి ధరావత్ స్వామి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

విద్యార్థులు పొదుపును అలవర్చుకోవాలి

జఫర్‌గఢ్: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు డబ్బు పొదుపు చేయడం అలవర్చుకోవాలని తిమ్మంపేట ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం దామెర షారోన్ సూచించారు. సంచాయిక పొదుపు పథకంలో భాగంగా పాఠశాలలో బ్యాంకింగ్ కార్యక్రమాన్ని శనివారం పాఠశాల హెచ్‌ఎం, సాంఘిక శాస్త్ర టీచర్ నాగుల లక్ష్మి కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డబ్బుల పొదుపునకు సంబంధించిన అకౌంట్ పుస్తకాలను అందజేశారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

కొడకండ్ల: త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా పార్టీ బలపర్చే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కొరారు. శనివారం కడగుట్టతండలో నిర్వహించిన పాకాల ఎంపీటీసీ క్లస్టర్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రభుత్వ బడికి పూర్వవిద్యార్థి తోడ్పాటు



రంగులు వేసిన పాఠశాల

దేవరుప్పుల: ప్రాథమిక విద్యనేర్పిన ప్రభుత్వ బడి దుస్థితులను చూసిన ఓ పూర్వ విద్యార్థి ఆ పాఠశాలకు రంగులు వేయించి తన గురుభక్తిని చాటుకున్నారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన ప్రాథమికోన్నత పాఠశాల కాస్త ఇటీవల ప్రైవేటు చదువుల మోజుతో ఆదరణ తగ్గి విద్యార్థుల సంఖ్య ఘననీయంగా పడిపోయింది. దీంతో పాలకవర్గాలు సైతం ఈ బడికి కనీస మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. ఈ క్రమంలోనే అమెరికాలో స్థిరపడిన స్థానికుడు ముప్పారపు శ్రీనివాస్ 20 రోజుల కిందట పాఠశాలను సందర్శించి చలించిపోయి బడి పురోగతికి హామీ ఇచ్చారు. ఈ మేరకు తన స్నేహితుడు తీగల సుదర్శన్‌కు రూ.25 వేలు పంపించి తొలుత పాఠశాలకు రంగులు వేయించి బడికి కొత్తదనం తెచ్చేలా తోడ్పాటు అందించడం పట్ల హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు ఖాజా, కీమా, కృష్ణ, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రాపోలు శేషారెడ్డి స్కూల్‌బ్యాగ్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శేషారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి రాపోలు వెంకటరెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు అందించినట్లు తెలిపారు.

పలకల..

లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు జన్మదినం సందర్భంగా శివునిపల్లి లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో స్థానిక ఆరవ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం విద్యార్థులకు పండ్లు, బిస్కట్లు, పలకలు పంపిణీ చేశారు. శివునిపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గౌరిశెట్టి అనీల్, సెక్రటరీ పులి వినయ్, ఎండీ.దస్తగిరి, సురేందర్, కరుణాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ రాణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

జఫర్‌గఢ్: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రాజమౌళి కోరారు. కూనూర్ ప్రాథమిక ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని తిడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉన్నందున అవి సోకకుండా ప్రతీఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ భారతిదేవి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో ఆమె మాట్లాడుతూ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పలు సీట్లు ఖాళీలు ఉన్నాయని అన్నారు. ఖాళీ సీట్లకు ఈ నెల 7వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నామని, ఆసక్తిగల విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే

జనగామ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే అని మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. శనివారం శామిర్‌పేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తల కొరివి పెట్టిన కుమార్తె

పాలకుర్తి: విస్నూరు గ్రామానికి చెందిన కన్న గట్టయ్యగౌడ్ (65) అనారోగ్యంతో మృతి చెందగా శనివారం మృతుడి ముగ్గురు కుమార్తెల్లో పెద్ద కుమార్తె రేణుక తలకొరివి పెట్టింది. మృతుడి కుటుంబానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో విస్నూరు గౌడ సంఘం ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించారు.